
సూర్య www.suryaa.com
# ప్రజ్ఞ
suryaapragnamagazine@gmail.com
బుధవారం 13 ఆగస్టు 2025
పేజీలు 8









# జాతీయ చిహ్నాలు

**SSC, RRB Exams Reasoning ★ GATE -2026 Notification**



ఎకానమి

ప్రజ్ఞ సంచిక కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి




పాలిటీ



జాగ్రఫీ

APPSC,TGPSC
JL/DL/Group 2
Exams Special

# ఆధునిక భారతదేశ చరిత్ర

# వందేమాతర ఉద్యమం

**బ్రిటీష్ వారు భారతీయ ఆచారాలను, సంస్కృతిని, సామాజిక వ్యవస్థను ధ్వంసం చేస్తూ మన ఉనికినే ప్రశ్నార్థకం చేసినప్పుడు మనం తిరగబడ్డాం. మన స్వాతంత్ర్యం కొరకు ప్రాణాలను సైతం అర్పించాం. ఇలాంటి పోరాటాలలో వందేమాతర ఉద్యమం ఒకటి. ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా జాతీయోద్యమంలో ముఖ్య ఘట్టమైన వందేమాతర ఉద్యమాన్ని మరోసారి స్మరించుకుందాం....**


పుణ్యభూమి, కర్మభూమి అయిన మనదేశంలోకి ప్రాచీనకాలం నుండి అనేకులు వచ్చారు. కొంతమంది ఇండియా నుండి సంపద పోగుచేసుకొని వెళ్ళి పోయారు. మరికొంత మంది మన దేశపు ఆచారాలు, సంప్రదాయాలు నచ్చి మన జన జీవన స్రవంతిలో కలిసి పోయారు. కానీ బ్రిటీష్ వారు మాత్రం ఎప్పటికీ మన దేశాన్ని పరాయి దేశం గానే భావించి, ఆర్థిక పరంగా మన దేశాన్ని కొల్లగొట్టారు. ఒక్క బ్రిటీష్ వారు తప్ప మన దేశానికి ఎవరు వచ్చినా మనతో మమేకం అయ్యారు. నేటికీ మనతోనే కలిసి పోయారు. కానీ బ్రిటీష్ వారు భారతీయ ఆచారాలను, సంస్కృతిని, సామాజిక వ్యవస్థను ధ్వంసం చేస్తూ మన ఉనికినే ప్రశ్నార్థకం చేసినపుడు మనం తిరగబడినాం. మన స్వతంత్రత కొరకు ప్రాణాలను సైతం అర్పించాం. ఇలాంటి పోరాటాలలో వందేమాతర ఉద్యమం ఒకటి. ఒకరకంగా జాతీయోద్యమ ఐదు ఘట్టాలలో (వందేమాతర ఉద్యమం, హోంరూలు ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండి యాఉద్యమం) వందేమాతర ఉద్యమం మొదటి ఘట్టం. అతివాదులు నడిపిన మహోన్నత ఉద్యమం ఇది.

బెంగాలీల విభజన వ్యతిరేక ఉద్యమాన్ని వందేమాతర ఉద్యమం అన్నారు. బెంగాల్ విభజన వ్యతిరేక ఉద్యమానికి వందేమాతర ఉద్యమం అని పేరెట్టినది బారిసోల్ అనే ప్రదేశంలో. ఆ పేరు పెట్టింది అశ్విన్ కుమార్ దత్తా. వందేమాతరం అంటే అర్థం తల్లి భారతి వందనమమ్మా (సెల్యూట్ టు అవర్ మదర్ లాండ్). ఈ వందేమాతర ఉద్యమంలో ఆబాలగోపాలం పాల్గొని విజయవంతం చేసారు. అసలు ఈ వందేమాతర ఉద్యమానికి కారణాలు ఏమిటి?

**వందేమాతరం-కారణాలు :**

కర్జన్ అని ఒక పేరున్న పక్కా సామ్రాజ్యవాద వైస్రాయి. తను అహంకారవాది. భారతదేశానికి వైస్రాయిగా వచ్చే సమయానికే కాంగ్రెస్‌ను ఇలా విమర్శించాడు. "జాతీయ కాంగ్రెస్సా? అదేమిటి? దానిని అంతం చేస్తాను". ఇలాంటి వ్యక్తి ఇండియాకి వచ్చి అసలు జాతీయ ఉద్యమం తీవ్రంగా జరుగుతున్న బెంగాల్ పై దృష్టి సారించాడు. ఆ రోజుల్లో జాతీయోద్యమంలో ఎక్కువగా బెంగాలీలు పాల్గొనేవారు. బ్రిటీష్‌వారి ద్వారా తీవ్రంగా నష్టపోయింది బెంగాల్ వారే కావటం గమనార్హం. 1757 ప్లాసీ యుద్ధం, అనంతరం 1764 బాక్సర్ యుద్ధాల ద్వారా బ్రిటీషర్స్ ముందుగా ఆక్రమించు కుంది, దివానీ (శిస్తువసూలు) అధికారాన్ని పొందింది బెంగాల్‌లోనే. కనుక బ్రిటీషర్స్ ప్రభావం పడిన తొలి భారతీయులు బెంగాలీలు. కనుక జాతీయోద్యమంలో బెంగాలీలు విరివిగా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అసలు బెంగాలీలను విభజిస్తే వారి పోరాట పటిమ, ఐక్యత నశిస్తుందని కర్జన్ ఉద్దేశ్యం. దీనికి తోడు ఆ రోజుల్లో బెంగాల్‌ని ఇలా అనేవారు. 'మొత్తం భారతదేశం ఈరోజు గురించి ఆలోచిస్తే, బెంగాల్ మాత్రం రేపటి గురించి, ఎల్లుండి గురించి ఆలోచిస్తుంది. (Total India thinks today but Bengal thinks today and future)

ఇలాంటి బెంగాల్ నేపథ్యం ఒకసారి చూద్దాం. బెంగాల్, బీహార్, ఒరిస్సా, అస్సాంలు కలిపి ఒక పెద్ద రాష్ట్రంగా ఉండేవి. క్రమేపి బ్రిటీషర్స్ పాలనా నేపథ్యాన్ని చూపి అస్సాంని విడదీసారు. కర్జన్ వచ్చేనాటికి బెంగాలీలను విభజన చేయటానికి పూనుకున్నారు. ముఖ్య కారణం బెంగాలీలను రెండుగా విడదీస్తే, రెండు ప్రాంతాలలో పెడితే వారి బలం సన్నగిల్లుతుంది. తద్వారా జాతీయోద్యమం బలహీనం అవుతుంది. ఇది కర్జన్ ఉద్దేశ్యం. దీనిని దృష్టిలో ఉంచుకొని లార్డ్‌కర్జన్ బెంగాలీలను రెండుగా విభజించాడు. ఈ విభజన 1905 అక్టోబరు 16న అమలులోకి వచ్చింది. ఇక్కడ పోటీ పరీక్షలకి ప్రిపేర్ అవుతున్న మీరు అర్థం చేసుకో వలసినది బెంగాల్ విభజన కాదు, బెంగాలీల విభజన. ఇది ఎలా జరిగిందంటే తూర్పు బెంగాల్, మరియు పశ్చిమ బెంగాల్. తూర్పు బెంగాల్‌లో బంగ్లాదేశ్ ఉంది. ఈ బంగ్లాదేశ్‌లోని మస్లింల ముందు బెంగాలీలు మైనారిటీలు అయిపోయారు. అలానే పశ్చిమ బెంగాల్‌లో ఒరిస్సా బీహారీల ముందు బెంగాలీలు మైనారిటీ అయ్యారు. రెండు బెంగాల్‌లలోనూ బెంగాలీలు అల్ప




సంఖ్యాకులు అయినారు. ఇకపైన బెంగాలీల మాట చెల్లుబాటు కాదు. ఒక బ్రిటీష్ దొర అన్నట్లు 'బెంగాల్ ఒక అవిభాజ్యమయిన శక్తి. అది కలసి ఉంటే దాని బలానికి భారత్‌లో బ్రిటీష్‌రాజ్యం విచ్ఛిన్నం అవుతుంది. అలాకాక బెంగాల్‌ని అనగా బెంగాలీలను విడదీస్తే బెంగాల్ శక్తి విచ్ఛిన్నమవుతుంది.

**పోరాటం :**

కర్జన్ బెంగాలీలను రెండుగా విభజిస్తున్నాడని తెలియగానే బెంగాలీలు దానికి వ్యతిరేకంగా వందల సమావేశాలు పెట్టుకున్నారు. బారిసోల్‌లో అశ్వని కుమార్ దత్త నెలకొల్పిన స్వదేశీ బోధన సమితి పోరాట వీరులను తయారుచేసింది. 1902లో సతీష్ చంద్రబోస్ అనుశీలన సమితిని ఏర్పాటు చేసాడు. అనుశీలన సమితి పేరిట అనేక ప్రాంతీయ శాఖలు కూడా వెలువడినాయి. వందేమాతర ఉత్సవాన్ని అతివాదులు స్వదేశీ ఉద్యమంగా మార్చేసారు. బ్రిటీష్ వస్తువులను త్యజించి, భారతీయ వస్తువులనే వాడాలి. ఇందులో భాగంగా విదేశీ ఉప్పు, చక్కెరను నిషేదించారు. మనవాళ్ళల్లో ఎవ రైనా ఇద్దరు ఎదురుపడితే వారిరువురూ 'వందేమాతరం' అని సంభోదించు కునేవారు. అలానే విదేశీ ఆన్సర్ షీట్‌లపై పరీక్షలు రాయమని భారతీయ విద్యార్థులు పట్టుబట్టారు. అలానే విదేశీ వస్త్రాలు తొడిగిన పెళ్ళికొడుకుకి పెళ్ళి చేయడానికి పురోహితులు ఒప్పుకో లేదు. అలానే స్వదేశీ బూట్లు, చెప్పులు అయితేనే పాలిష్ చేసేవారు. అంటే వందేమాతర ఉద్యమం స్వదేశీ ఉద్యమంగా రూపాంతరం చెంది బహు ముఖంగా విస్తరించింది.

బెంగాలీల విభజన, భారతదేశం అంతటా క్రమేపీ రాజుకోవటం ప్రారంభించింది. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన అమర్ సోనార్ బంగ్లా అనే గీతం ప్రజలను జాగృతపరచింది. విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు వాడకం అనేది జన నినాదం అయింది. విదేశీ వస్తువులు అమ్మేవారిని నిరోధించడం, వారి దుకాణాల ముందు పికెటింగ్‌లు నిర్వహించడం సర్వసాధారణం అయింది. ఈ సందర్భంగా బెంగాల్‌లో 'స్వదేశీ జాతీయ కళాశాలను ఏర్పాటు చేసారు. (నేషనల్ కాలేజ్ ఆఫ్ బెంగాల్) దీనికి ప్రిన్సిపల్‌గా అరవింద్ ఘోష్ వ్యవహరించారు.

ముఖ్యమయిన పాయింట్ ఏంటంటే, కర్జన్ చేసిన బెంగాలీల విభజనను 1905 బెనారస్‌లో జరిగిన జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశం తీవ్రంగా ఖండించింది. అప్పటి ఈ సమావేశానికి నాయకులు గోపాల కృష్ణగోఖలే. 1906లో కలకత్తాలో దాదాబాయి నౌరోజి నాయకత్వాన కాంగ్రెస్ సమావేశం స్వరాజ్య సాధనా లక్ష్య తీర్మానం ఆమోదించడం జరిగింది. అనేక స్వదేశీ పరిశ్రమలు ఏర్పాటు చేయబడినాయి. ప్రఫుల్లచంద్ర రాయ్ బెంగాల్‌లో స్వదేశీ కెమికల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసారు. బాలగంగాధర్ తిలక్ కలకత్తా వెళ్ళి కాళికా దేవి ఉత్సవాలు, వీరాష్టమి ఉత్సవాలు, గణపతి ఉత్సవాలు, శివాజీ జయంతి ఉత్సవాలు నిర్వహించి బెంగాలీలలో స్ఫూర్తిని నింపాడు. ఉద్యమం బాగా ఊపందుకున్న వేళ మళ్ళీ బెంగాలీలను ఒకటిగా కలపవలసిన ఆవేదన తప్పలేదు బ్రిటీష్ వారికి. అయినా మనలను అణచటానికి అనేక నిరంకుశ చర్యలు జరిపారు. ఢక్కా నవాబు సలీముల్లా ఖాన్‌కు రొక్కం ముట్టచెప్పి మతవాదానికి పాల్పడేలా చేసారు. ముస్లీం లీగ్‌ను ఏర్పాటు చేసి (1906) జాతీయోద్యమంలో చీలిక తేవడానికి ప్రయత్నం చేసారు.

**తలొంచిన బ్రిటీష్ ప్రభుత్వం**

వందేమాతర ఉద్యమంలో బ్రిటీషర్స్ ఎన్ని నిరంకుశ అణచివేత చర్యలకి పాల్పడినా, భారతీయులు పట్టువదలలేదు. పోరాటం జరుపుతూనే ఉన్నారు. ఒకే ఒక్క ఎజెండా.... బెంగాల్‌ని తిరిగి ఏకం చేయాలి. సరిగ్గా ఇదే సమయంలో బ్రిటీష్‌రాజు ఐదవ జార్జి, అతని భార్య మేరీలు భారత సందర్శనకు వచ్చారు. వీరిని అప్పటి వైస్రాయి లార్డ్ హార్డింగ్ సాదరంగా ఆహ్వానించాడు. వారి గౌరవార్థం దర్బార్ ఏర్పాటు చేసాడు. వందేమాతర ఉద్యమ చర్యలు జరిగాయి. ఫలితంగా బ్రిటీషర్స్ మొండి వైఖరి వీడి మెత్తబడ్డారు. 1911లో బెంగాల్ విభజనను రద్దు చేస్తున్నామని ప్రకటించారు. అంతేకాదు రాజధానిని కలకత్తా నుండి ఢిల్లీకి మారుస్తున్నట్లు ఆదేశాలిచ్చారు. ఒక అంకం ముగిసింది. ఇందులో భారతీయులమైన మనం విజయం సాధించాం. తొలిసారిగా విజయం సాధించాము. ఇది గొప్ప విషయం. వందేమాతర ఉద్యమం రాబోవు అనేక ఉద్యమాలకి స్ఫూర్తిగా నిలచింది.

**ఆంధ్రాలో వందేమాతర ఉద్యమం**

ఆంధ్రాలో వందేమాతర ఉద్యమం ఘనంగా జరిగింది. బెంగాలీలకు మద్దత్తు పలుకుతూ తెలుగు వారు ఎక్కడికక్కడ స్వదేశీ వాదాన్ని వినిపించారు. వీధి పోరాటాలు చేసేవారే నాయకుల నడివీధుల్లో ఉద్యమాన్ని నడిపారు. ఈ సందర్భంగా వందేమాతర ఉద్యమ కాలంలో ఆంధ్రాలో నాలుగు సంఘటనలు జరిగాయి. ఇవి తెలుగువారిలో చైతన్యాన్ని పెంచాయి.

**1)రాజమండ్రి కళాశాల ఘటన – 1907 ఏప్రిల్ 24**

వందేమాతర ఉద్యమ కాలంలో కోస్తాంధ్రలో బిపిన్ చంద్రపాల్ పర్యటించారు. ఏప్రిల్ 24న రాజమండ్రి లో జరిగిన బిపిన్ చంద్రపాల్ సభకు అప్పటి రాజ మండ్రి ట్రైనీ కళాశాల విద్యార్థులు గాడిచర్ల హరిసర్వోత్త మరావు నాయకత్వంలో పాల్గొన్నారు. ఇది తెలుసుకున్న ఆ కాలేజీ ప్రిన్సిపల్ మార్క్‌హంటర్ గాడిచర్లను కళాశాల నుండి బహిష్కరించారు.

**2) కాకినాడ దొమ్మికేసు (1907 మే 31) –**

అప్పట్లో కాకినాడ జనరల్ హాస్పిటల్‌లోని బ్రిటీష్ డాక్టర్ పేరు జనరల్ కేంప్. ఇతను జాతీయోద్యమానికి వ్యతిరేకి. కనుక ఇతనికి వ్యతిరేకంగా కొంపెల్ల కృష్ణా రావు అనే బాలుడు వందేమాతరం అని నినదించాడు. ఫలితంగా కేంప్ కృష్ణారావుని తీవ్రంగా కొట్టాడు. ఇది తెలిసిన కాకినాడ ప్రజలు కేంప్ గల హాస్పిటల్ పై దొమ్మి చేసారు. ఫలితంగా బ్రిటీషర్స్ యాభై మందిని అరెస్టు చేసారు. వీరిలో ముగ్గురికి ద్వీపాంతర శిక్ష పడింది. వారు అపిరాల లక్ష్మీనరసింహారావు, చినపే రయ్య, పెదపేరయ్య.

**3)కోటప్పకొండ సంఘటన**

**(1909 ఫిబ్రవరి 18)**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో కోటప్పకొండ గొప్ప శైవక్షేత్రం. నరసరా వుపేట తాలూకాలో ఉన్నది. ప్రతి శివరాత్రి కోటప్పకొండ శివాలెత్తిపో తుంది. అయితే 1909 ఫిబ్రవరి 18న వచ్చిన శివరాత్రి వందేమాతర నినాదాలకి కేంద్రం అయింది. చేబ్రోలు నివాసి చిన్నపరెడ్డి తన ఎడ్లబండిలో కోటప్ప కొండకు వెళ్ళాడు. కానీ అక్కడ అవుట్ పోస్ట్ పోలీసులు చిన్నపరెడ్డి ఎద్దులకి గాయాలు చేసారు.ఫలితంగా చిన్నప్పరెడ్డి 'వందేమాతర' నినాదాలు చేసాడు. చివరికి చిన్నప్పరెడ్డిని బ్రిటీష్ వారు ఉరితీసారు. వందేమాతర ఉద్యమ కాలంలో భారతదేశం మొత్తంలో ఉరిశిక్షకు గురి అయిన ఒకేఒక్క వ్యక్తి చిన్నప్పరెడ్డి. అతను మన తెలుగువారు కావడం గుండె ఉప్పొంగుతుంది.

**4) తెనాలి బాంబు కేసు (1909 ఏప్రిల్ 6)**

పేరు తెలియని ఒక జాతీయవాది తెనాలి రైల్వే ట్రాక్ పై బాంబు పెట్టారు. ఇది తెలియని 'చెన్నడు' అనే వ్యక్తి దానిని ముట్టుకోగానే అది పేలింది. ఫలితంగా బ్రిటీషర్స్ చుక్కపల్లి రామయ్య, లక్కరాజు బసవయ్య, కాటమరాజు వెంకటరాయుడులను అరెస్టు చేసి మద్రాసు కోర్టుకి తరలించారు. కాగా వీరి తరుపున మద్రాసు కోర్టులో వాదించి, నిర్దోషులుగా విడిపించింది ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులుగారు.

అసలు తెనాలి రైల్వే ట్రాక్‌పై బాంబు పెట్టడానికి కారణం మద్రాసు నుండి కలకత్తా హౌరాకి ఎక్స్‌ప్రెస్ ఆంగ్ల సైనికులతో వెళుతోంది. అది నిడుబ్రోలు వరకు వచ్చే సమయానికి మనవాళ్ళు తెనాలి రైల్వే ట్రాకు పై బాంబులు అమర్చారు. బ్యాడ్‌లక్ అది పేలకముందే చెన్నడు పేలిపోయాడు. ఈ విధంగా మనం జాతీయోద్యమానికి సమిధలుగా మారాం. దేశంలో ఎక్కడ జాతీయోద్యమ సంఘటన జరిగినా దాని మూలాలు మనవద్ద ఉండేవి.



హిస్టరీ రఫీసార్
అసిస్టెంట్ ప్రొఫెసర్
సెల్: 9848827238



# ఇండియన్‌పాలిటి

# భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాలు

**భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాలు :**

**1. అతిపెద్ద లిఖిత రాజ్యాంగం :**
రాజ్యాంగాలను లిఖితమైన (ఉదా–అమెరికా రాజ్యాంగం) మరియు అలిఖితమైన (ఉదా–బ్రిటిష్ రాజ్యాంగం) అని విభజిస్తారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం. ప్రారంభంలో భారత రాజ్యాంగంలో 395 ఆర్టికల్స్, 22 భాగాలు,8 షెడ్యూల్లు ఉన్నాయి. ప్రస్తుతం రాజ్యంగాములో 470 ఆర్టికల్స్, 12షెడ్యుల్, 25భాగాలు ఉన్నాయి .


**2. దృడ,అదృడ లక్షణాలు :**
రాజ్యంగాలను దృడ (rigid) అదృడ (flexible) రాజ్యంగాలుగా విభజిస్తారు. దృడ రాజ్యాంగం అంటే దాన్ని సవరించేందుకు ప్రత్యేక విధానాన్ని అనుసరించాల్సి ఉంటుంది. ఉదా: అమెరికా రాజ్యాంగం. అదృడ రాజ్యాంగాన్ని సులువుగా సవరించవచ్చు, ఉదా: బ్రిటన్.

భారత రాజ్యాంగం ఈరెండు లక్షణాలను కలిగి ఉంది. ఆర్టికల్ 368 ప్రకారం భారత రాజ్యాంగ సవరణలకు రెండు రకాలు ఉన్నాయి, కొన్ని నిబంధనలను పార్లమెంటు ప్రత్యేక మెజారిటీతో 2/3 ద్వారా మాత్రమే సవరించవచ్చు, కొన్ని కనీసం రాష్ట్రాల సగం ఆమోదంతో మాత్రమే సవరించగలరు. కొన్ని నిబంధనలను పార్లమెంటు సాధారణ మెజారిటీతో కూడా సవరించవచ్చు.

**3. పార్లమెంటరీ ప్రభుత్వం :**
భారత రాజ్యాంగం 'వెస్ట్ మినిస్టర్' తరహ పార్లమెంట్ ప్రభుత్వాలను కలిగి ఉంది.
పార్లమెంటరీ వ్యవస్థ - శాసన వ్యవస్థ (Legislature) మరియు కార్యనిర్వాహక వ్యవస్థ (Executive) మధ్య సహకారం మరియు సమన్వయం పై ఆధారపడి ఉంటుంది. దీనినే బాధ్యతాయుత ప్రభుత్వ పద్ధతి, కేబినెట్ ప్రభుత్వం, అని కూడా పిలుస్తారు. ఈ విధానంలో కేంద్రంలో రాష్ట్రపతి ,రాష్ట్రంలోగవర్నర్ నామమాత్ర కార్య నిర్వహణాధికారులుగా, కేంద్రంలో ప్రధానమంత్రి ,రాష్ట్రములో ముఖ్యమంత్రి వాస్తవ కార్య నిర్వహణాధికారులుగా ఉన్నారు .

**4. సమాఖ్య ,ఏక కేంద్ర లక్షణాలు :**
భారత రాజ్యాంగంలో 'ఫెడరేషన్' అనే పదం ఎక్కడా లేదు బదులుగా, ఆర్టికల్ 1 ప్రకారం భారతదేశాన్ని రాష్ట్రాల యునియన్ (Union of States)గా పేర్కొన్నారు, భారత రాజ్యాంగం సమాఖ్య మరియు ఏక కేంద్ర లక్షణాల సమ్మిళితం. రెండు స్థాయిల ప్రభుత్వాలు (కేంద్రం,రాష్ట్రాలు), అధికారాల విభజన, లిఖిత రాజ్యాంగం ,స్వతంత్ర న్యాయ వ్యవస్థ, ద్విసభా విధానం వంటి సమాఖ్య లక్షణాలను, బలమైన కేంద్రం, ఒకే రాజ్యాంగం, ఒకే పౌరసత్వం, ఏకీకృత న్యాయవ్యవస్థ,రాష్ట్రానికి గవర్నర్‌లను నియమించడం వంటి ఏక కేంద్ర లక్షణాలను కలిగి ఉంది. డా. B.R.అంబేద్కర్ మన రాజ్యాంగాన్ని అత్యంత కేంద్రీకృత సమాఖ్య రాజ్యమని ఒప్పుకున్నారు. K.C వేర్ అర్ధ సమాఖ్య గా పేర్కొన్నారు.

**5. ఏక పౌరసత్వం :**
భారత రాజ్యాంగం సమాఖ్య విధానాన్ని అనుసరించినప్పటికీ, ఏక పౌరసత్వం కలిగి ఉంది, కాని అమెరికా వంటి దేశాలలో దేశానికే కాకా ,తాను నివసించే రాష్ట్ర పౌరుడిగా కూడా పరిగణించ బడతాడు. ఏక పౌరసత్వ విధానం ను మనం బ్రిటన్ దేశం నుండి గ్రహించం.




**6. ప్రాథమిక హక్కులు :**
భారత రాజ్యాంగం భాగం - III వ భాగం లో 12 – 35 వరకు గల నిభందనల ప్రకారం పౌరులకు ఆరు రకాల మౌలిక హక్కులు కల్పించబడినవి. వ్యక్తీ ,వికాసానికి ఇవి దోహదపడతాయి .
a) సమానత్వ హక్కు (ఆర్టికల్స్ 14–18)
(b) స్వేచ్ఛ హక్కు (ఆర్టికల్స్ 19–22)
(c) దోపిడీ నుండి రక్షణ హక్కు (ఆర్టికల్స్ 23–24)
(d) మత స్వేచ్ఛ హక్కు (ఆర్టికల్స్ 25–28)
(e) సాంస్కృతిక, విద్యా హక్కు (ఆర్టికల్స్ 29–30)
(f) రాజ్యాంగ పరిరక్షణ హక్కు (ఆర్టికల్ 32)
ప్రారంభంలో 7 హక్కులు ఉండేవి 1978 లో 44 వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్థి హక్కును (300 (ఎ )వీటి నుండి తొలగించి చట్టబద్ధమైన హక్కుగా మార్చారు . వీటికి న్యాయస్థానాల రక్షణ ఉంది .

**7. ప్రాథమిక విధులు :**
1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా, స్వరణ్ సింగ్ కమిటీ సిఫార్సులపై 10 ప్రాథమిక విధులను రాజ్యంగాములోని 4A భాగంలో 51(A)అనే నిభందన లోపొందుపరిచారు. ప్రాథమిక విధులకు న్యాయ సంరక్షణ లేదు. ఈవిధులు దేశం పట్ల పౌరుల బాద్యతలనుతెలియజేస్తాయి. 2002లో చేసిన 86 వ రాజ్యాంగ సవరణద్వారా 11వ ప్రాథమిక విధిని చేర్చారు.

**8. ఆదేశిక సూత్రాలు :**
వీటిని గురించి రాజ్యంగాములోని IV భాగంలో 36 నుండి 51 వరకు గల నిభందనలు వివరిస్తాయి. వీటిని శ్రేయో రాజ్య స్థాపన కోసం ,సమసమాజ స్థాపన కోసం రాజ్యంగాములో పొందుపరిచారు . వీటికి న్యాయ స్థానం రక్షణ లేదు. వీటిని 3 రకాలుగా విభజించారు అవి
1) సామ్యవాద సూత్రాలు
2)గాంధేయ వాద సూత్రాలు
3)ఉదారవాద సూత్రాలు ఇవే కాకుండా అదనపు సూత్రాలు అని కూడా వీటిలో ఉన్నాయి .

**9. సార్వజనీన వయోజన ఓటు హక్కు :**
రాజ్యాంగం ప్రకారం, 18 సంవత్సరాల పైబడిన ప్రతి పౌరుడు ఓటు వేసే హక్కు కలిగి ఉంటాడు. జాతి, మతం, లింగం, సంపద, విద్యా పరంగా ఏ వివక్ష లేకుండా అందరికీ (18 సంవత్సరాల) ఓటు హక్కు 326 నిభందన ప్రకారం కల్పించబడింది. ప్రారంభంలో 21 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు ఉండేది. 61వ రాజ్యాంగ సవరణ ద్వారా (1988–89)లో ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18సంవత్సరాలకు తగ్గించారు. ప్రజాస్వామ్య దేశాలలో ఓటు హక్కు ప్రజల చేతుల్లో ఆయుధం వంటిది .ప్రభుత్వాన్ని ఎన్నుకోగలరు మార్చగలరు.

**10. ఏకీకృత – స్వతంత్ర న్యాయవ్యవస్థ :**
స్వతంత్ర న్యాయ వ్యవస్థను భారత రాజ్యంగం ఏర్పాటు చేసింది,పౌరుల హక్కులను, రాజ్యాంగాన్ని ఇది పరిరక్షిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగాన్ని అతిక్రమించకుండా నియంత్రణ చేసి, కేంద్ర రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తితే సుప్రీంకోర్టు పరిష్కరిస్తుంది.

**11. లౌకిక రాజ్యం :**
లౌకిక అనే పదం 42వ సవరణ ద్వారా (1976లో) భారత రాజ్యాంగ ప్రవేశికలో చేర్చబడింది. లౌకిక రాజ్యం అనగా "మతప్రమేయం లేని రాజ్యం. .మతవిషయంలో పౌరులకు స్వేచ్ఛ ఉంటుంది .మన రాజ్యానికి అధికారిక మతం అంటు ఉండదు,అన్ని మతాలు సమానమే.

**12. అధికార విభజన :**
భారత రాజ్యాంగం దేశాన్ని రాష్ట్రాల యూనియన్ గా ప్రకటించబడినప్పటికీ కేంద్ర –రాష్ట్రాల మధ్య అధికార విభజన జరిగింది ఈ అధికారాలను మూడు జాబితాల కింద విభజించారు. 1. కేంద్ర జాబితా (99 అంశాలు)2.రాష్ట్రజాబితా (59 అంశాలు )3. ఉమ్మడి జాబితా (52 అంశాలు) లలో ప్రస్తుతం ఉన్నాయి . ఈవే కాకుండా అవశిష్ట అధికారాలు ఉన్నాయి .

**13. ద్వి సభా విధానం :**
రాజ్యాంగం ప్రకారం మన పార్లమెంట్ రెండు సభలు కలిగి ఉంది. 1. దిగువ సభ అయిన లోక్ సభ,2. ఎగువ సభ అయిన రాజ్య సభ.అదే విధంగా 6 రాష్ట్రాలు రెండు సభలను కలిగి ఉన్నాయి .

**14. అత్యవసర నిబంధనలు :**
భారత రాజ్యాంగం అత్యవసర పరిస్థితుల్లో దేశ భద్రత, సమగ్రతను కాపాడేందుకు మూడు రకాల అత్యవసరాలు అనుమతిస్తుంది. జాతీయ అత్యవసర స్థితి (National Emergency) – ఆర్టికల్ 352, రాష్ట్ర అత్యవసర స్థితి /రాష్ట్ర పతిపాలన (Presidents Rule)–ఆర్టికల్ 356,ఆర్థిక అత్యవసర స్థితి – ఆర్టికల్ 360, దేశఆర్థిక స్థిరత్వానికి ముప్పు ఉన్నపుడు విధించవచ్చు.

**15. స్వతంత్ర సంస్థలు** (Independent Bodies): ఎన్నికల సంఘం (Election Commission), కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (CAG), యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (UPSC), స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్లు (SPSC),అటార్నీ జనరల్, అడ్వకేట్ జనరల్ వంటి వాటికి పరిపాలన మరియు ఇతరవిధుల నిర్వహణ కోసం కొన్ని సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించారు .



సత్య ఇర్గదిండ్ల
SATYA SIR APP
9177323403

## రచనలకు ఆహ్వానం

పోటీ పరీక్షలకు అత్యుత్తమ మెటీరియల్, గైడెన్స్ అందిస్తూ 'ప్రజ్ఞ' విద్యార్థుల మన్ననలందుకుంది. 'ప్రజ్ఞ'ను మరింత ఉపయోగకరంగా తీర్చి దిద్దేందుకు అధ్యాపకులు, ఔత్సాహికుల నుంచి రచనలను (మెటీరియల్) ఆహ్వానిస్తున్నాం. ఏపీపీఎస్సీ , టీజీపీఎస్సీ, ఆర్‌ఆర్బీ, ఎస్ఎస్సి, బ్యాంక్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షల మెటీరియల్‌ను సులభరీతిలో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా రాయగల అధ్యాపకులు మెటీరియల్‌ను 'ప్రజ్ఞ' ఇమెయిల్ (suryaapragna71@gmail.com)కు లేదా 7288890072 వాట్సప్ నెంబరుకు పంపవచ్చు. రచనతో పాటు ఫోటో, ఫోన్ నెంబర్, అడ్రస్ తదితర వివరాలను జత చేయాలి.

## ఏపీపీఎస్సీ నుంచి భారీగా జాబ్ నోటిఫికేషన్లు

ఆంధ్ర ప్రదేశ్‌లో నిరుద్యోగులకు శుభవార్త. త్వరలోనే ఏపీపీఎస్సీ నుంచి భారీగా జాబ్ నోటిఫికేషన్లు వెలువడనున్నాయి. ప్రస్తుతం అన్ని రకాల నోటిఫికేషన్లు కలిపి 18 వరకు జారీకి సిద్ధంగా ఉన్నాయి. ఇందులో 12నోటిఫికేషన్లు క్యారీ ఫార్వర్డ్ పోస్టులకు సంబంధించినవి. అయితే పోస్టుల సంఖ్య మాత్రం తక్కువగా ఉంది.

**నోటిఫికేషన్ల వివరాలు....**

జిల్లా సైనిక వెల్ఫేర్, వ్యవసాయ అధికారి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (దేవాదాయశాఖ), టెక్నికల్ అసిస్టెంట్ (గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్), డ్రాఫ్ట్‌మెన్– గ్రేడ్–2 (ఫారెస్టు), హార్టీకల్చర్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ (ఫిషరీస్), రాయల్టీ ఇన్‌స్పెక్టర్ (మైన్స్), అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ ఇంజినీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, హాస్పిటల్ వెల్ఫేర్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్–కం–టైపిస్టు పోస్టుల భర్తీకి సంబంధించి వరుస నోటిఫికేషన్లు వెలువడనున్నాయి.

**ఏపీ డీఎస్సీ ఫలితాలు...**

మెగా డీఎస్సీ–2025 పరీక్షల తుది మార్కులను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. డీఎస్సీ పరీక్ష నార్మలైజేషన్ మార్కులు, టెట్ వెయిటేజీ మార్కులు కలిపి ప్రకటించింది. అభ్యర్థులు ఏపీడీఎస్సీ వెబ్‌సైట్‌లో లాగిన్ అయి మార్కులను చూసుకోవచ్చు. టెట్ మార్కులపై అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం తుది మార్కులను విడుదల చేసి జిల్లాల వారీగా జాబితాలు ప్రకటిస్తారు. ఆయా జిల్లాల్లో పోస్టులు, రిజర్వేషన్ల ప్రకారం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ప్రకటిస్తారు.

# ఎకానమి

## APPSC, TGPSC గ్రూప్-1, 2 JL, DL



## వలస - కొలమానాలు (మెజర్స్ ఆఫ్ మైగ్రేషన్)

**వలస - కొలమానాలు (మెజర్స్ ఆఫ్ మైగ్రేషన్):**

- వలసను రెండు పద్ధతుల ద్వారా కొలవవచ్చు.
  1. ప్రత్యక్ష పద్ధతి
  2. పరోక్ష పద్ధతి.
- ప్రత్యక్ష పద్ధతిలో వలసదారుల యొక్క నమోదు ప్రక్రియ. ఉదా. : జనాభా లెక్కలు, పాస్‌పోర్టు, వీసాల దరఖాస్తులు, ఆధార్ నమోదు ద్వారా జరుగుతుంది.
- భారతదేశంతో పాటు ఇతర దేశాలలో అంతర వలసలను తెలుసుకొనుటకు జనాభా లెక్కలను బహిర్గత వలసలను తెలుసుకొనుటకు పాస్‌పోర్ట్, వీసాలను ఉపయోగిస్తారు.
- **వలస రేటు (మైగ్రేషన్ రేటు)** : ఒక సంవత్సర కాలంలో ఒక ప్రాంతంలో 1000 మంది జనాభాకు వలస వచ్చిన వారు, వలస వెళ్ళిన వారి సంఖ్యను 'వలస రేటు' అంటారు.
- వలస రేటు = (వలస వచ్చినవారు +వలస వెళ్ళిన వారు/ఆ ప్రాంతంలో ఏడాదిమధ్యలో జనాభా) ×1000

**అంతర వలస రేటు (ఇన్ మైగ్రేట్ రేట్) :** ఒక సంవత్సర కాలంలో ఒక ప్రాంతంలో 1000 మంది జనాభాకు ఎంతమంది వలస వచ్చారో తెల్పేది.

- అంతర వలస రేటు = (వలస వచ్చినవారి సంఖ్య/ ఆ ప్రాంతంలో ఏడాది మధ్యలో జనాభా) × 1000

**బాహ్య వలస రేటు (ఔట్ మైగ్రేషన్ రేటు) :**

- ఒక సంవత్సర కాలంలో ఒక ప్రాంతంలో 1000 మంది జనాభాకు ఎంతమంది వలస వెళ్ళారో తెలిపేది
- బాహ్య వలస రేటు = (వలస వెళ్ళిన వారి సంఖ్య / ఆ ప్రాంతంలో ఏడాది మధ్యలో జనాభా) × 1000

**నికర వలస రేటు (నెట్ మైగ్రేషన్ రేటు) :**

- ఒక సంవత్సర కాలంలో ఒక ప్రాంతంలో 1000 మంది జనాభాకు వలస వచ్చిన వారి నుండి వలస వెళ్ళిన వారిని తీసివేయగా మిగిలిన వారిని తెలిపేది.
- ఒక సం. కాలంలో ఒక ప్రాంతంలో 1000 మంది జనాభాకు ఎంతమంది వలస వచ్చారో తెలిపేది.
- నికర వలస రేటు = (వలస వచ్చిన వారు-వలస వెళ్ళిన వారు/ఆ ప్రాంతంలో ఏడాది మధ్యలో జనాభా) × 1000

**వలస చట్టాలు /సూత్రాలు :**

- వలసదారుల హక్కులను పరిరక్షించే మరియు వలసలను నియంత్రించే అంతర్జాతీయ చట్టపరమైన నిబంధనలు మరియు సూత్రాలు.
- వలస చట్టం అంటే అంతర్జాతీయ మరియు సంబంధిత దేశీయ చట్టం.
- ఒక రాష్ట్రం / దేశానికి చెందిన వ్యక్తులు మరొక రాష్ట్రం /దేశానికి వెళ్ళినపుడు వారి అధికార పరిధిలో ఉన్నపుడు వర్తించే పద్ధతులు నిబంధనలను వలస చట్టం అంటారు.

**రావెన్ స్టెయిన్ వలస చట్టాలు / సూత్రాలు (1834-1913) :**

- ఆంగ్లో జర్మన్ భౌగోళిక శాస్త్రవేత్త ఎర్నెస్ట్ రావెన్ స్టెయిన్ 1876, 1885 మరియు 1889లో బ్రిటన్, యూరప్ మరియు ఉత్తర అమెరికాలో అంతర్గత మరియు అంతర్జాతీయ వలసలపై పత్రాలను ప్రచురించారు.
- 1885లో బ్రిటన్‌లోని జన్మస్థలం ఆధారంగా వలస నమూనా/వలస చట్టాలను రూపొందించిన వారిలో మొదటి వ్యక్తి రావెన్ స్టన్.
- రావెన్ స్టన్ ప్రకారము వలసలకు మూడు ప్రాథమిక కారకాలు ఉన్నాయి. అవి ప్రేరణ, దూరం, వలసదారుల కూర్పు. అంటే వలసల వెనుక ఉద్దేశ్యం అంటే ఆర్థిక భద్రత, రాజకీయ, సాంస్కృతిక, సామాజికంగా గాని, వలసదారుల ప్రయాణం గాని వలసదారుల లింగం మరియు వయస్సు ఉంటాయి.
- రావెన్ స్టన్ వలసదారుల ప్రేరణ, దూరం, కూర్పు అనే 3 అంశాల ఆధారంగా 11 వలస సూత్రాలను ప్రతిపాదించారు. అవి

1. చాలామంది వలసదారులు తక్కువ దూరం మాత్రమే ప్రయాణిస్తారు.
2. ఎక్కువ దూరం వెళ్ళే వలసదారులు పట్టణాలలో స్థిరపడతారు.
3. వలసలు ఎక్కువగా దశల వారిగా జరుగుతాయి.
4. ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని వలసలు జరుగుతాయి.
5. పట్టణ జనాభా పెరుగుదల, సహజంగా కాకుండా వలసల వలన పెరుగును.
6. వలసలు ఎక్కువగా గ్రామాల నుండి ఉంటాయి.
7. వలసలు అనేవి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో గల అంతరాలను బట్టి ఉంటాయి.
8. వలసలలో ఎక్కువగా వయోజనులు ఉంటారు.
9. అంతర్గత వలసలో ఆడవారు, అంతర్జాతీయ వలసలో ఎక్కువగా మగవారు ఉంటారు.
10. ఆర్థిక వ్యవస్థ వైవిధ్యం, రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో వలసలు పెరుగుతాయి.
11. ప్రతి వలస ప్రతి-ప్రవాహాన్ని ఉత్పత్తి చేస్తుంది. వలసలు ఎక్కువగా వ్యతిరేఖ దిశలో జరుగుతాయి. అంటే ఒక ప్రాంతం నుండి వెళ్ళే వ్యక్తుల స్థానంలోకి మరొకటి వస్తుంది. రావెన్‌స్టన్ దీనిని కౌంటర్-కరెంట్స్ అన్నారు.

**లీ వలస చట్టాలు / సూత్రాలు / సిద్ధాంతాలు :**

- ఎవరెట్ యస్. లీ అనే అమెరికన్ భౌగోళిక శాస్త్రవేత్త 1966లో సమగ్ర వలస సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అతను తన సూత్రీకరణలను నాలుగు కారకాలు/అంశాలతో ప్రారంభించారు. అంటే వలసదారుల లక్షణాలను / సూత్రాలను నిర్ణయించే 4 అంశాలు ఉన్నాయి.

1. **మూలస్థానానికి సంబంధించిన కారకాలు** : వలస యొక్క వివిధ అంశాలను నిర్ణయించడంలో వలసదారు యొక్క స్వగ్రామంలో సామాజిక మరియు ఆర్థిక పరిస్థితి చాలా ముఖ్యమైనది. అంటే వలస విలువ, దూరం, గమ్యస్థానంలో ఉండే కాలం మొదలైనవి ముఖ్యం.
2. **గమ్యస్థానానికి సంబంధించిన కారకాలు** : గమ్యం యొక్క సామాజిక మరియు ఆర్థిక పరిస్థితి కూడా ముఖ్యమైనది. అంటే మంచి జీవనశైలితో పాటు మెరుగైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు ఎక్కువమందిని ఆకర్షిస్తాయి.
3. **అడ్డంకులకు జోక్యం చేసుకునే కారకాలు** : జోక్యం చేసుకునే అడ్డంకులు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వలస వెళ్ళినపుడు ఎదురయ్యే సమస్యలు మరియు అడ్డంకులను సూచిస్తాయి.
4. **వ్యక్తిగత అంశాలు** : కులం, మతం, తరగతి, ఆదాయ స్థాయి, విద్య, ఆరోగ్య వయస్సు మొదలగునవి వలస వెళ్ళే వ్యక్తి సామర్థ్యాన్ని నిర్ణయిస్తాయి.

**వలస నమూనాలు (మోడల్ ఆఫ్ మైగ్రేషన్) :**

- వలసలకు సంబంధించిన నిర్ణయాలు ఆర్థిక, సామాజిక మరియు సాంస్కృతిక అంశాల ఆధారంగా రూపొందించబడినాయి.
- వలస నమూనాలు ఈ నిర్ణాయకాలను అధికారికం చేస్తాయి.

**రావెన్ స్టెయిన్ నమూనా :**

ప్రారంభ వలస నమూనాలు అమెరికన్ భౌగోళిక శాస్త్రవేత్త అయిన ఇజి రావెన్ స్టెయిన్ సిద్ధాంతంలో ముఖ్యమైనది. అతను గ్రేట్ బ్రిటన్, యు.ఎస్.లో వలసల నమూనాల పరిశీలన ఆధారంగా పదకొండు వలస చట్టాలను ప్రతిపాదించారు.

**న్యూటన్ గురుత్వాకర్షణ నమూనా :**

రావెన్ స్టెయిన్ ప్రభావం న్యూటన్ గురుత్వాకర్షణ నమూనాలో స్పష్టంగా ఉంటుంది.

- ఎక్స్ మరియు వై అనే రెండు ప్రదేశాల మధ్య సంచరించే ప్రజల సంఖ్య అనేది ఎక్స్ యొక్క జనాభాను వై యొక్క జనాభాతో భాగించినపుడు వచ్చే సంఖ్యతో సమానంగా ఉంటుంది.
- ఎక్స్ నగరం నుండి వై నగరానికి వలస వెళ్ళినపుడు ఎ,బి నగరాల జనాభా అధికంగా ఉన్నపుడు సహజంగానే వలస వెళ్ళే వారిసంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది.

**లూయిస్ మరియు ఫల్జ్ నమూనా :**

- 1950లో ముఖ్యంగా 1960 ఆర్థిక నమూనాలు వలస పరిశోధనతో ప్రధాన పాత్ర పోషించాయి.
- డబ్ల్యు. ఆర్థర్ లూయిస్ (1954) యొక్క ద్వంద్వ ఆర్థిక వ్యవస్థ యొక్క ఆర్థిక అభివృద్ధి నమూనా అపరిమిత కార్మికుల సరఫరాతో వలసల యొక్క స్పష్టమైన నమూనా కాకపోయినప్పటికీ పెరుగుతున్న ఆధునిక (పట్టణ) రంగ కార్మిక డిమాండ్‌ను పూరించడానికి సాంప్రదాయ (వ్యవసాయ) రంగంలో మిగులు శ్రమను వినియోగించే సాధనం ఈ నమూనాలో వలసలు. అంటే వలసలు డిమాండ్ లేదా ఉపాధి ఆధారితంగా కాకుండా వేతనాల ద్వారా నడుపబడతాయి.
- లూయిస్ ప్రకారం వలసల డిమాండ్ లేదా ఉపాధి ఆధారితంగా కాకుండా వేతనాల ద్వారా నడుపబడతాయి.
- లూయిస్ మోడల్ కార్మిక మిగులు ఉందని ఊహిస్తుంది.
- థియోడర్ డబ్ల్యు ఫల్జ్ (1964) ప్రకారం వలసలకు శ్రమ, వ్యవసాయ ఉత్పత్తిని తగ్గించదు. వేతనాలను ప్రభావితం చేయదు.
- సాంప్రదాయ ఆర్థిక దృక్పథానికి అనుగుణంగా ఉన్న ఊహను ఫల్జ్ ప్రశ్నిస్తున్నారు.

**జెలిన్‌స్కీ నమూనా :**

వలసలకు సంబంధించి జెలిన్ స్కీ ముఖ్యంగా నాలుగు దశల రూపంలో వివరించారు.

- ఆధునిక పూర్వ సాంప్రదాయ సమాజంతో పరిమిత స్థాయిలో వలసలు గ్రామీణ ప్రాంతాల మధ్య వలసలు ఉంటాయి.
- మారుతున్న సమాజంలో గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వలసలు
- ఆధునిక సమాజంలో అత్యధిక పట్టణ వలసలు (పట్టణాల మధ్య వలసలు)
- ఆధునిక అనంతర పారిశ్రామిక సమాజంలో తిరోగమన వలసలు.

**క్లార్క్ వలస నిర్ణయ నమూనా :**

- వలసలు స్వల్ప కాలంలో నిరంతర రాకపోకలకు భిన్నంగా శాశ్వతంగా దూరప్రాంతాలకు వలస వెళ్ళటాన్ని క్లార్క్ సూచించారు.

**లీ యొక్క అడ్డంకులు / అవరోధాల నమూనా :**

- లీ ప్రకారం వలసలు సంభవించే విధానాలు భిన్నంగా ఉంటాయి. ఎందుకంటే వయస్సు, లింగం వివిధ సామాజిక వర్గాల ప్రకారం మానవులు పుష్ మరియు పుల్ కారకాలకు ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా ప్రతిస్పందిస్తారు.
- ఈ కారకాలు, పరిస్థితులు వ్యక్తుల యొక్క అవరోధాలను అధిగమించే సామర్థ్యాన్ని నిర్దేశిస్తాయి. అంటే చదువు, జ్ఞానం, జనాభా, కుటుంబ సంబంధాలు మొదలైన కారకాలు వలసలను ప్రోత్సహించటం గాని నిరోదించడం గాని చేస్తాయి.

**స్లాఫర్స్ అవకాశాల సిద్ధాంతం :**

- గమ్యస్థానంలో లభ్యమవుతున్న అవకాశాల సంఖ్యకు అనులోమానుపాతంలో వలసలు జరుగుతాయి.
- ప్రారంభ స్థానం నుండి గమ్య స్థానానికి మధ్యలో లభించే అవకాశాల సంఖ్యకు విలోమానుపాతంలో వలసలు సంభవిస్తాయి.

**వలసలను ప్రభావితం చేసే అంశాలు** : వలసలను ప్రభావితం చేసే అంశాలు / కారకాలు రెండు రకాలు.

1. **ఆర్థిక కారకాలు (ఎకనామిక్ ఫాక్టర్స్)** : ఈ ఆర్థిక కారకాలలో ముఖ్యమైనవి ఆదాయం, ఉపాధి అవకాశాలు, వలసల వలన అయ్యే వ్యయం.
2. **ఆర్థికేతర కారకాలు (నాన్ ఎకనామిక్ ఫాక్టర్స్)** : వలస గమ్యస్థానంలో ఆకర్షణ, మూల స్థలంపై అయిష్టత, ప్రవాసకుని అభిరుచులు, బంధువుల సహకారం. మూలస్థలం-గమ్య స్థలాల మధ్య ఆర్థిక, సామాజిక వైవిధ్యం ఎక్కువగా ఉన్నపుడు వ్యక్తులు తక్కువ అవకాశాలు గల ప్రాంతాల నుండి ఎక్కువ అవకాశాలు ఉన్న ప్రాంతాలకు వలస పోతారు.



ఎం.అన్నారెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ
హనుమకొండ.



# జాతీయ చిహ్నాలు

జాతీయ చిహ్నాలు ఒక దేశ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని తెలుపుతాయి. మన జాతీయ చిహ్నాలు దేశ భక్తిని, సంస్కృతిని, సంప్రదాయాలను, ఆచారాలను, చరిత్రతో పాటు, మానవ మనుగడ, సమైక్యతలను తెలుపుతాయి.

**జాతీయ పతాకం**

జాతీయ పతాకం మన దేశభక్తికి చిహ్నం. మన జాతీయ జెండ త్రివర్ణ పతాకం. దీనిని రూపొందించినది పింగళి వెంకయ్య. ఈయన తెలుగువాడు కావడం మన కెంతో గర్వకారణం. దీనిలో కాషాయం, తెలుపు, ఆకుపచ్చ మూడు రంగులు సమాంతర అడ్డ పట్టీలగా పై నుంచి కిందకు వరుస క్రమంలో ఉంటాయి. కాషాయం ధైర్యానికి, త్యాగానికి చిహ్నం. తెలుపు శాంతికి, సత్యానికి, ఆకుపచ్చ విశ్వాసానికి, పరాక్రమానికి చిహ్నాలు. పతాకం పొడవు వెడల్పులు 3:2 నిష్పత్తిలో ఉంటాయి. పతాకం మధ్యలో తెలుపు పట్టీలో ముదురు నీలి రంగులో అశోక చక్రం ఉంటది. అశోక చక్రంలో 24 (స్పోక్స్) ఆకులు ఉంటాయి. ఈ 24 స్పోక్స్ 24 భావాలు తెలియ చేస్తాయి. ఇవి 24గంటలు భారత ప్రగతిని సూచిస్తాయి. ఈ చక్రం అశోకుని సారనాథ్ స్థూపం నుంచి తీసుకోబడినది. సారానాథ్ స్థూపాన్ని ఉత్తరప్రదేశ్ లోని వారాణాసి సమీపంలోని చునార్ నుంచి తవ్వితీసిన ఇసుకరాయితో (సాండ్ స్టోన్‌తో) చేశారు. దీని నిర్మాణం క్రీ.పూ. 250లో జరిగినది. ఇది అశోక స్తంభంపై భాగాన కలదు. 1921 మార్చి 31న విజయవాడలో నిర్వహించిన జాతీయ కాంగ్రెస్ సమావేశాల్లో పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకాన్ని మహాత్మగాంధీకి చూపగా చరఖాను ఉంచమని సూచించాడు. మనం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 1 ని జాతీయ పతాకం ఆవిర్భావ దినోత్సవంగా నిర్వహిస్తారు. రాజ్యాంగ పరిషత్ భారతదేశ పతాకాన్ని 1947 జులై 22న ఆమోదించినది. 2002కు ముందు జాతీయ సెలవు దినాల్లో తప్ప మిగత రోజుల్లో ఎగురవేయడానికి వీలులేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రభుత్వ ఉన్నతాధికారులు మాత్రమే ఎగురవేసే వారు. అయితే 2002 జనవరి 15న నూతన ఫ్లాగ్ కోడ్‌ను కేంద్ర మంత్రిమండలి ఆమోదించినది. దీని ప్రకారం భారతీయులు జాతీయ పతాకాన్ని ఎప్పుడైన, ఎక్కడైన, ఎగురవేసుకోవచ్చు.

అశోక చక్రం జాతీయ పతాకం మధ్యలో తెల్లపట్టీ మధ్యలో ముదురు నీలిరంగులో ఉంటుంది. ఈ చక్రంలో 24 ఆకులు (స్పోక్స్) ఉంటాయి. ఒక్కోక్క స్పోక్ ఒక భావాన్ని తెలియ చేస్తాయి. అవి 1. ప్రేమ 2. ధైర్యం 3. సహనం 4. శాంతి 5. కరుణ 6. మంచి 7. విశ్వాసం 8. మృదు స్వభావం 9. సంయమనం 10. త్యాగనిరితి 11. ఆత్మార్పణం 12. నిజాయితి 13. సచ్చీలత 14. న్యాయం 15. దయ 16. హుందాతనం 17. వినమ్రత 18. తాదాత్మయం 19. జాలి 19. దివ్యజ్ఞానం 21. ఈశ్వర జ్ఞానం 22. దైవనీతి(దివ్యనీతి) 23. దైవభీతి (దైవభక్తి) 24. దైవంపై ఆశ /నమ్మకం/విశ్వాసం.

**జాతీయ చిహ్నం**

జాతీయ చిహ్నం (మన దేశ చిహ్నం) నాలుగు సింహాల గుర్తు. దీన్ని ఉత్తర ప్రదేశ్‌కు సమీపంలోని చునార్ నుంచి తవ్వి తీసిన ఇసుక రాయితో రూపొందించారు. అశోకుడు వేసిన స్తంభంలో ఉండే నాలుగు సింహాల నుంచి దీనిని గ్రహించారు. మొత్తం నాలుగు సింహాలు కాగా మనకు మూడు సింహాలు మాత్రమే కనిపిస్తాయి. స్థూప కింది భాగంలో ధర్మ చక్రం ఉంటుంది. చిహ్నానికి దిగువున 'సత్యమేవ జయతే' అని దేవ నాగరి లిపిలో ఉంటుంది. ఈ సూక్తిని ముండకోపనిషత్ నుంచి గ్రహించారు. ధర్మ చక్రానికి కుడివైపున వృషభం, ఎడమవైపున ఒక అశ్వం ఉంటుంది. (ధర్మచక్రంపై వృషభం, అశ్వం, ఏనుగు, సింహాలు ఉంటాయి.).

- ❍ సింహం రాజసానికి, గాంభీర్యానికి గుర్తు.
- ❍ వృషభంస్థిరత్వం, శ్రమ, పట్టుదలకి గుర్తు.
- ❍ అశ్వం శక్తికి, వేగానికి, నమ్మకానికి ప్రతీక
- ❍ చక్రం చలనానికి, గతిశీలతకు, ప్రగతికి తార్కాణం.

**జాతీయగీతం**

జాతీయగీతం మన జాతీయ గీతం జనగణమన. దీనిని రవీంద్రనాథ్ ఠాగూర్ బెంగాలీ భాషలో రచించాడు. దీనిని 1911 డిసెంబర్ 27 న మెదటిసారిగా కలకత్తాలో జరిగిన భారతీయ జాతీయ కాంగ్రెస్ సమావేశంలో పాడటం జరిగినది. 1950 జనవరి 24న రాజ్యాంగ సభ 'జాతీయగీతం'గా గర్తించినది. జనగణమన ప్రధాన మూలంలో ఏడు పద్యాలు ఉన్నాయి. మనం మెదటి పద్యాన్ని మాత్రమే ఆలపించుతున్నాం. ఈ గీతాన్ని ఆలపించటానికి 52 సెకండ్లు పడుతుంది. జనగణమనను తొలి సారిగా 1912లో తత్వబోధిని పత్రికలో 'భారత విధాత' శీర్షికన రవీంద్రనాద్ ఠాగూర్ ప్రచురించారు. జాతీయ గీతాన్ని 1919 ఫిబ్రవరి 28న చిత్తూరు జిల్లాలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్లంలోకి అనువదించారు. 1919 లో చిత్తూరు జిల్లాలోని మదనపల్లె లోని బీటీ కళాశాల ప్రిన్సిపాల్ జేమ్స్ కజిన్ సతీమణి మార్గరెట్ కజిన్స్ విజ్ఞప్తి మేరకు జాతీయ గీతాన్ని బెంగాల్ నుంచి ఆంగ్లంలోకి 'మార్నింగ్ సాంగ్ ఆఫ్ ఇండియా' పేరిట అనువదించినారు. అనువదించిన ఈ ప్రతి నకలు బీటీ కళశాలలో ఇప్పటికి భద్రంగా ఉన్నది. దీనికి స్వర కల్పన బీటీ కళాశాల ప్రిన్సిపాల్ జేమ్స్ కజిన్ సతీమణి మార్గరెట్ కజిన్స్ చేశారు.

**జాతీయ గేయం**


మన జాతీయగేయం వందేమాతరం బకించంద్ర చటర్జీ సంస్కృతంలో రచించిన 'ఆనందమఠ్ నుండి తీసుకోబడినది. దీనిని తొలిసారిగా 1896లో కలకత్తాలో జరగిన సమావేశంలో ఆలపించారు. స్వాతంత్రోద్యమ కాలంలో విప్లవ గీతంగా దీనిని గానం చేశారు. వందేమాతర గేయాన్ని అరవింద్ ఘోష్ ఆంగ్లంలోకి అనువదించారు. దీనిని జాతీయ గేయంగా రాజ్యాంగ పరిషత్ 1950 జనవరి 24న ఆమోదించినది.

**జాతీయ ప్రతిజ్ఞ (National Pledge)**

జాతీయ ప్రతిజ్ఞ భారతదేశానికి సంబంధించిన ఒక దేశభక్తి ప్రతిజ్ఞ. పాఠశాలలలో జరిగే సభలలో, ముఖ్యంగా స్వాతంత్ర్య దినోత్సవం మరియు గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ పండుగల సందర్భంగా విద్యార్థులు ఈ ప్రతిజ్ఞను చేస్తారు. ఇది దేశం పట్ల విధేయత, ప్రేమ మరియు గౌరవాన్ని తెలియజేస్తుంది. జాతీయ ప్రతిజ్ఞను పైడిమర్రి వెంకట సుబ్బారావు గారు 1962లో రచించారు. ఈయన నల్గొండ జిల్లాలోని అనపర్తి గ్రామానికి చెందినవారు. 1962లో ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్టణం జిల్లా ట్రెజరీ అధికారిగా పని చేస్తున్నప్పుడు పైడిమర్రి వెంకట సుబ్బారావుగారు తెలుగులో రచించారు. విశేషమేమిటంటే, సుబ్బారావు గారు తెలుగులో రచించిన ఈ ప్రతిజ్ఞను తరువాత ఇతర భారతీయ భాషలలోకి అనువదించారు. జాతీయ ప్రతిజ్ఞను మొదటిసారిగా 1963లో విశాఖపట్నంలోని ఒక పాఠశాలలో చదివారు. 1964లో మహ్మద్ కరీంచాగ్లా అధ్యక్షతన జరిగిన కేంద్ర విద్యా సలహా మండలి బెంగుళూరులో సమావేశంలో దీనిని జాతీయ ప్రతిజ్ఞగా ఆమోదించింది. జనవరి 25,1965 నుండి అన్ని పాఠశాలల్లో తప్పనిసరి చేయాలని నిర్ణయించారు.

**జాతీయ ప్రతిజ్ఞ**

"భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదర సహోదరీమణులు. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను, సుసంపన్నమైన, బహువిధమైన నా వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హుడనై ఉండటానికి నేను ఎల్లప్పుడూ కృషి చేస్తాను. నేను నా తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, పెద్దలందరినీ గౌరవిస్తాను, ప్రతివారితోను మర్యాదగా నడుచుకుంటాను. నా దేశం పట్ల, నా ప్రజల పట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయస్సే నా ఆనందానికి మూలం." ఈ ప్రతిజ్ఞ భారతదేశ పౌరులకు దేశం పట్ల వారి కర్తవ్యాన్ని గుర్తుచేస్తుంది.




**జాతీయ జంతువు**

మన జాతీయ జంతువు పులి. 1972లో పులిని జాతీయ జంతువుగా భారత ప్రభుత్వం ప్రకటించినది. దీని శాస్త్రీయ నామం 'పాన్థెర టైగ్రిస్'. 1973 నుంచి ప్రాజెక్ట్ టైగర్ పేరుతో పులుల సంరక్షణ పథకాన్ని ఏర్పాటుచేశారు. శక్తి, గంభీరత, స్వాభిమానం, చురుకుదనాలకు పులి చిహ్నం.

**జాతీయ పక్షి**

మన జాతీయ పక్షి నెమలి. 1963లో భారత ప్రభుత్వం నెమలిని జాతీయ పక్షిగా గుర్తించినది. దీని శాస్త్రీయ నామం పావో క్రిస్టాటస్. భారత వన్య ప్రాణి చట్టం 1972 ప్రకారం నెమలికి పూర్తి రక్షణ కల్పించారు. నెమలి అందం, గంభీరత, దయకు చిహ్నం.

**జాతీయ పుష్పం**

మన జాతీయ పుష్పం తామర. అందంగా ఆకర్షణీయంగా కనిపించే తామర పువ్వు మన దేశంలోని జలాశయాల్లో కనిపిస్తుంది. దీని శాస్త్రీయ నామం 'నూసిఫెర గెర్టిన్'. కమలం పవిత్రత, అందం, జ్ఞానానికి చిహ్నం.

**జాతీయ జలచరం**

నదుల్లో జీవించే డాల్ఫిన్‌ను 2009 అక్టోబర్ 5 కేంద్ర ప్రభుత్వం జాతీయ జలచరంగా ఆమోదించినది. దీని శాస్త్రీయ నామం ' ప్లాటా నిష్టా గాంగెటిక'. మంచినీటి జీవులైన డాల్ఫిన్‌లను గంగా, బ్రహ్మపుత్ర ఉప నదుల్లో కనుగొన్నారు. వీటి జీవిత కాలం 35 సంవత్సరాలు. గంగా నదుల్లో ఉన్న డాల్ఫిన్లను 'సూసులు' అని, బ్రహ్మపుత్ర నదుల్లో ఉన్న డాల్ఫిన్లను 'హిహులు' అని వేరు వేరు పేర్లతో పిలుస్తారు.

**జాతీయ నది**

గంగా నదిని భారత ప్రభుత్వం పవిత్ర నదిగా 2008లో గుర్తించినది. ఈ నది నీటిని పవిత్ర జలంగా గుర్తిస్తారు. ఈ నది ఉత్తరఖండ్ రాష్ట్ర పరిధిలోని హిమాలయాల్లోని గంగోత్రి అనే హిమనీ నదంలో భాగీరథి నదిగా ఉద్భవించింది. ప్రవహమార్గంలో దేవ ప్రయాగ వద్ద అలకనంద నదితో కలుస్తుంది. అక్కడ నుండి దీనిని గంగా నది అని పిలుస్తారు. గంగానది ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖాండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల గుండా ప్రవహించుతుంది. దీని మెత్తం పొడవు 2,525 కి.మీ.

**నమామి గంగా**

గంగాదిని శుభ్రపరచడానికి, కాలుష్యానికి తగ్గించడానికి మరియు జీవ వైవిధ్యాన్ని రక్షించడానికి ఉద్దేశించబడ్డ నమామి గంగా ప్రాజెక్టు 2014లో ప్రారంభించబడినది.

**జాతీయ ఫలం**

పండ్లల్లో రారాజైన మామిడిని జాతీయ ఫలంగా పిలుస్తారు. దీని శాస్త్రీయ నామం 'మాంజిఫెర ఇండికా'. ఆ పండులో ఎ, సి, డి విటమిన్లు పుష్కలంగా ఉన్నాయి.

**జాతీయ వృక్షం**

మన జాతీయ వృక్షం మర్రి చెట్టు (Ficus benghalensis) దీని శాస్త్రీయ నామం 'ఫైకస్ బెంగాలి లెన్సిస్'. ఇది భారతీయ సంస్కృతిలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక మరియు పర్యావరణ ప్రాముఖ్యత కలిగి ఉంది. మర్రి చెట్టు దాని విశాలమైన కొమ్మలు, గాలి వేర్లు మరియు దీర్ఘాయుష్షుతో ప్రసిద్ధి చెందింది. దీని ఊడలు కొన్ని కిలో మీటర్ల వరకు విస్తరించి ఉంటాయి. మిగతా చెట్లతో పోలిస్తే వీటి ఆయుష్షు ఎక్కువ.

**జాతీయ వారసత్వ జంతువు**

కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 2010లో ఏనుగును మన జాతీయ వారసత్వ జంతువుగా ప్రకటించినది. భారతదేశంలో సాంస్కృతిక, అధ్యాత్మిక, మరియు చారిత్రక ప్రాముఖ్యత కలిగిన జంతువు. ఏనుగు శక్తి, జ్ఞానం, గంభీరతకు చిహ్నంగా ఉంటుంది. దీని శాస్త్రీయ నామం 'లోక్సోదోనోట'

**జాతీయ క్రీడ**

మన జాతీయ క్రీడ హాకీ. ఒలంపిక్స్‌లో తొలి సారిగా స్వర్ణ పతకాన్ని సాధించినది హాకీ లోనే. 1928–56 వరకు వరుసగా ఆరు సార్లు స్వర్ణ పతకాలను తెచ్చి మన దేశానికి ప్రపంచ వ్యాప్తంగా ఎన లేని ఖ్యాతి హాకీ క్రీడ ద్వార లభించినది.

(మిగతా 6వ పేజీలో..)

అనంతారపు కృష్ణయ్య,
డైరెక్టర్
శ్రీ సాయి కోచింగ్ సెంటర్,
కోదాడ, సూర్యాపేట (జిల్లా).
99487 50605



# SSC, RRB, PSC Police, Bank Exams

# REASONING ANALOGY

Analogies are crucial for exams as they assess Logical Reasoning, Problem-Solving, and cognitive abilities. They test the ability to identify patterns and relationships, which are essential skills for various Competitive Exams, including those for Banking, SSC, and Railway. Regular practice with Analogies enhances these Skills, making it easier to tackle complex questions and improve performance

**1Q) Biography: Autobiography**

A) Testimony: Confession
B) Author: Performer
C) Mobile: Automobile
D) Memories: History
E) None of these

Solution : A

Explanation: A biography is a person's life story written by someone else. Whereas autobiography is one's story written by oneself. Similarly, a testimony is a solemn declaration of one's wrong doing by someone while a confession is a one's claim of oneself being a wrong doer.

**2Q) Poultry: Farm**

A) Rice: Granary
B) Child: Playground
C) Rubber: Estate
D) Bee: Hive
E) None of these

Solution : C

Explanation: Poultry is reared in a farm. Similarly, rubber is grown in an estate.

**3Q) Poverty: Prosperity**

A) Love: Sorrow
B) Intelligence: Stupidity
C) Rain: Flood
D) Train: Cart
E) None of these

Solution : B

Explanation- The words in each pair are antonyms of each other)

**4Q) Basement: Attic**

A) Zenith: Root
B) Zenith: Apex
C) Nadir: Zenith
D) Apex: Pinnacle
E) None of these

Solution : C

Explanation- Nadir (lowest point) and Zenith (highest point) can be compared to basement and attic respectively

**5Q) Portfolio: Securities**

A) Lecture: Consignment
B) Panel: Jurors
C) Trustee: Company
D) Star: Class
E) None of these

Solution : B

Explanation- A portfolio is the entire group of securities a person holds for investment, similarly, a panel is a whole group of jurors

**6Q) Moon: Satellite**

A) Fishes: Pond
B) Flowers: Garland
C) Singer: Chorus
D) Earth: Planet
E) None of these

Solution : D

Explanation- Moon is a satellite, likewise earth is a planet

**7Q) Executioner: Criminal**

A) Florist: Flowers
B) Butcher: Animals
C) Convict: Murderer
D) Worker: Manager
E) None of these

Solution : B

Explanation- First is responsible for the death of the seconds

**8Q) Story: Novel**

A) Sea: Ocean
B) School: University
C) Book: Dictionary
D) Poetry: Drama
E) None of these

Solution : A

Explanation- Second is more voluminous form of the first

Dr. M.Reddi Ramu,
Professor, Viswam Engineering College (Autonomous),
Madanapalli





# జాతీయ చిహ్నాలు

( 5వ పేజీ తరువాయి )

**జాతీయ క్యాలెండర్**

మన జాతీయ క్యాలెండర్ శక సంవత్సరం ఆధారంగా తయారు చేశారు. ఈ క్యాలెండర్ ప్రకారం సంవత్సరానికి 12 నెలలు. చైత్రం, వైశాఖం, జ్యేష్ఠం, ఆషాడం, శ్రావణం, భాద్రపదం, ఆశ్వీజం, మార్గశిరం, కార్తీకం, పుష్యం, మాఘం, పాల్గుణం. సాధారణంగా సంవత్సరానికి 365 రోజులు ఉంటాయి. లీపు సంవత్సరానికి 366 రోజులు ఉంటాయి. భారత ప్రభుత్వంచే గుర్తించబడిన మన జాతీయ పంచాంగం (క్యాలెండర్) 1957 మార్చి 22 నుంచి ప్రారంభమైనది. దీని ప్రకారం శక సంవత్సరం 1879 చైత్ర మాసం 1 వ తేది నుంచి జాతీయ పంచాంగం ప్రారంభమైనది. ప్రపంచ వ్యాప్తంగా గ్రిగేరియన్ క్యాలెండర్ అములులో ఉన్నది.

**ఋతువులు** - ఋతువులు ఆరు

| | | |
|---|---|---|
| చైత్రం, వైశాఖం | వసంతఋతువు (మార్చి, ఏప్రిల్) | చెట్లు చిగురించి పూలు పూస్తాయి. |
| జ్యేష్ఠం,ఆషాడం | గ్రీష్మ ఋతువు (మే, జూన్) | ఎండలు బాగా ఉంటాయి,బావులు, చెరువులు ఎండిపోతాయి |
| శ్రావణం,బాద్రపదం | వర్షఋతువు (జులై, ఆగస్ట్) | భారీ వర్షాలు కురుస్తాయి. |
| ఆశ్వీజం,కార్తీకం | శరదృతువు (సెప్టెంబర్-అక్టోబర్) | తక్కువ ఉష్ణోగ్రత శీతాకాలం ప్రారంభం |
| మార్గశిరం, పుష్యం | హేమంత ఋతువు (నవంబర్-డిసెంబర్) | చలి కాలం, మంచు కురిసే కాలం, పంటలు కోతకు వచ్చే సమయం. |
| మాఘం, పాల్గుణం | శిశిర ఋతువు (జనవరి-ఫిబ్రవరి) | ఆకులు రాల్చు కాలం |

**జాతీయ కరెన్సీ**

మన జాతీయ కరెన్సీ రూపాయి. మన కరెన్సీ చిహ్నంగా దేవనాగరి లిపిలో ఉన్న ఆర్ అనే అక్షరం సూచిస్తుంది. ఆర్ అనే అక్షరం పైన రెండు గీతలు సమానం అని అర్థాన్ని ఇస్తాయి. ఈ చిహ్నాన్ని భారత ప్రభుత్వం 2010 జులై 15 వ తేదీన అమోదించినది. దీనిని ముంబైలో ఉన్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలెజికి చెందిన ఉదయ్ కుమార్ రూపొందించారు.

**జాతీయ పతాక నియామవళి**



జాతీయ పతాకనియామవళి అనేది భారతపతాక వాడకాన్ని నిరేశించే చట్టాల సమాహారం.

- జాతీయ పతాకాన్ని ఎల్ల వేళలా “గౌరవం, విధేయతతో చూడాలి. ”జాతీయ పతాకం ఎప్పుడూ నేలగానీ, నీటిని గాని తాక రాదు. టేబుల్ క్లాత్ గా గానీ, ప్లాట్ ఫాం మీద గానీ, విగ్రహాల మీదగా, ఇతర వస్తువుల మీద గాని కప్ప రాదు. 2005-07-05న సవరించ బడిన నియమావళి ప్రకారం దుస్తుల మీద గాని, యూనిఫారాల్లో జెండాను వాడవచ్చు.
- ఉద్ధేశ్యపూర్వకంగా జెండాను తల కింద చేయడం, ఆవిష్కరణకు ముందు పువ్వులు తప్ప ఇతర వస్తువులను జెండాలో ఉంచడం, జెండా మీద ఏదైన రాయడం కూడ నిషిద్ధం.
- 2002 కు ముందు జాతీయ సెలవుదినాల్లో తప్ప మిగతా దినాల్లో ప్రజలు జెండా ఎగుర వేయడానికి వీలులేదు. ఈ నిబంధనను తొలిగించాలని కోరుతూ నవీన్ జిందాల్ అనే పారిశ్రామికవేత్త 2001లో సుప్రీంకోర్టులో కేసు గెలవడంతో దేశ పౌరులందరికి జెండా ఎగురవేసే అవకాశం కలిగినది.
- జాతీయ పతకాన్ని తమ వాహనాల మీద ఎగుర వేసే అధికారం రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రి, వివిధ రాష్ట్రాల గవర్నరులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ఇతర శాసన సభ్యులు, లోకసభ, శాసనసభ స్పీకర్లు, రాజ్యసభ, రాష్ట్రశాసన మండళ్ళ ఛైర్మెన్లు, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, సైనిక, నావిక, వాయు సేనల్లోని ఉన్నతాధికారులకు మాత్రమే ఉంది.
- మన జాతీయ పతాకం తయారు చేసేటప్పుడు పొడవు వెడల్పులు 3:2 నిష్పత్తులలో ఉండాలి.

**మనం జాతీయ పతాకం ఎగుర వేసేటప్పుడు కొన్ని నియమాలు పాటించాలి. అవి**

- భారతీయ చట్టం ప్రకారం ప్రతి నిత్యం గౌరవం, విధేయతతో చూడాలి.
- కాషాయం రంగు పై భాగంలో ఉండాలి.
- సూర్యోదయానికి ముందే ఎగురవేయాలి. సూర్యాస్తమయానికి ముందే దించి వేయాలి.
- ఇతర ఏ పతాకం మన జాతీయ పతాకాని కంటే ఎత్తులో ఉండరాదు.
- ఒక వరుస క్రమమంలో జెండాలను ఎగుర వేయాల్సి వచ్చినప్పుడు మిగిలిన జెండాలన్ని మన జాతీయ జెండాకు ఎడుమ వైపున ఉండాలి.
- ముఖ్యమైన రోజుల్లో మాత్రమే పౌరులు జాతీయ జెండాను ఎగుర వేయాలి.

**అవనతం**

రాష్ట్రపతి ఆదేశాల ప్రకారం మాత్రమే సంతాప సూచకంగా పతాకాన్ని అవనతం (జెండా కర్రకు సగం ఎత్తులో ఎగరెయ్యడం) చెయ్యాలి. సంతాప కాల అవధి ఎంతో కూడా ఆ ఆదేశంలోనే పేర్కొనబడుతుంది. అవనతం చేసేటప్పుడు మొదట పతాకాన్ని పూర్తిగా ఎగరేసి తర్వాత నెమ్మదిగా కిందకు దించాలి. పతాకాన్ని తీసేసే ముందు దాన్ని పూర్తి ఎత్తుకు ఎగరేసి తర్వాతనే కిందికి దించాలి. భారత జాతీయపతాకం ఒక్కదాన్నే అవనతం చెయ్యాలి. ఇతరదేశాల పతాకాలు మామూలు గానే ఎగురుతాయి.

- రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి చని పోయి నప్పుడు మాత్రమే జాతీయ పతాకం అవతనం చేయబడుతుంది.
- జాతీయ పతకం అవతనం చేసేటప్పుడు మెదట పతకాన్ని పూర్తిగా ఎగురవేసిన తర్వాతనే కిందకి దించి వేయాలి.
- లోక్సభ స్పీకర్, ప్రధాన న్యాయమూర్తి, మరణిస్తే డిల్లీలో, కేంద్ర క్యాబినెట్ మంత్రి మరణిస్తే డిల్లీలో, రాష్ట్ర రాజధానుల్లో, సహయ మంత్రి చనిపోతే డిల్లీలో లేదా రాష్ట్ర రాజధానుల్లో లేదా కేంద్ర పాలిత ప్రాంతాల్లో, గవర్నర్ లేదా లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్య మంత్రి మరణిస్తే ఆయా రాష్ట్రాల్లో / కేంద్రపాలిత ప్రాంతాల్లో జాతీయ పతకాన్ని అవనతం చేయాలి.
- పైవారిలో ఎవరైనా చనిపోయినట్లు మధ్యాహ్నం తర్వాత సమాచారం తెలిసి, మరుసటిరోజు సూర్యోదయం లోపల అంత్యక్రియలు జరగకపోయి నట్లైతే పైన పేర్కొన్నచోట్ల మరుసటిరోజు కూడా అవనతం చేసి ఉంచాలి. పైవారికి అంత్యక్రియలు జరిగేరోజు అవి జరిగేచోట కూడా అవనతం చేసి ఉంచాలి.

**విసర్జన**

జాతీయ పతాకం ఉపయోగించుకోలేని పరిస్థితికి చేరుకున్నప్పుడు దానిని సగౌరవంగా విసర్జించాలి. పాడై పోయిన లేదా చిరిగిపోయిన జెండాలను పక్కన పడేయటం లేదా అగౌరవంగా నాశనం చేయకూడదు. అలాంటి వాటిని కాల్చడం లేదా భూమిలో పాతి పెట్టడం చేయాలి.

For Daily Current Affairs
అనంతారపు కృష్ణయ్య, డైరెక్టర్
శ్రీ సాయి కోచింగ్ సెంటర్,
YOU TUBE CHANNEL
99487 50605

# వీక్లీ రౌండప్

## అంతర్జాతీయం

**ఆగస్టు 4 - ఆగస్టు 10**


- చైనాలోని బీజింగ్‌లో ప్రపంచంలో మొదటి రోబో మాల్ ప్రారంభమైంది. ఇది మొట్టమొదటి 4ఎస్-స్టోర్. 4ఎస్ అంటే, సేల్స్, సర్వీస్, స్పేర్ పార్ట్స్, సర్వేస్ (కస్టమర్ ఫీడ్‌బ్యాక్). ఇవన్నీ ఒకే చోట అందుబాటులో ఉంటాయి.
- ఇతర దేశాలతో వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వీయ విధ్వంసానికి పాల్పడుతున్నారని అమెరికన్ ఆర్థికవేత్త, జాన్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ స్టేవ్ హాంకె తెలిపారు.
- భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రష్యా పర్యటన లో భాగంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ,ఆ దేశ ఉప ప్రధాని డెనిస్ మంతురోవ్‌తో భేటీ అయ్యారు.
- చంద్రుడిని రెండుసార్లు చుట్టిన ఆస్ట్రోనాట్ జిమ్ లోవెల్ కన్నుమూశారు.
- హమాస్‌తో జరుగుతున్న పోరును మరింత తీవ్రతరం చేసి గాజాను స్వాధీనం చేసుకోవాలన్న ప్రణాళికకు ఇజ్రాయెల్ సెక్యూరిటీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
- డోనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి పురస్కారాన్ని ఇవ్వాలని కంబోడియా ప్రధాని హున్ మానెట్ డిమాండ్ చేశారు.
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ మిత్రదేశం అని చెప్పుకుంటూనే 50శాతం సుంకాలు విధించారు.
- వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో అరెస్టుకు సహకరించే సమాచారం అందించిన వారికి 50 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 438 కోట్లు) ఇస్తామని అమెరికా ప్రకటించింది.
- చైనాలో చికున్‌గునియా వైరస్ కేసులు ఏడువేలు రికార్డు అయ్యాయి.
- రష్యా లోని కమ్చట్కా ద్వీపకల్పంలో ఆరు శతాబ్దాల కాలం నాటి క్రాషెనిన్నికోవ్ అగ్నిపర్వతం బద్దలైంది.
- బంగ్లాదేశ్‌లో సాధారణ ఎన్నికలు 2026 ఫిబ్రవరి మొదటి వారంలో నిర్వహించనున్నట్లు బంగ్లాదేశ్ ఎన్నికల సంఘం ప్రకటించింది. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా, సజావుగా ఎన్నికలు నిర్వహించడం సవాలుతో కూడుకున్న పని అని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఏఎంఎం.నసీరుద్దీన్ అన్నారు.

## రాష్ట్రీయం

**ఆగస్టు 4 - ఆగస్టు 10**

- అరకు కాఫీకి అంతర్జాతీయంగా మరింత గుర్తింపును తీసుకొచ్చి, మార్కెట్‌ను విస్తరించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆగస్టు 9న పాడేరులో నిర్వహించిన అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంలో టాటా సంస్థతో ఒప్పందం చేసుకుంది. నర్సీపట్నం కేంద్రంగా రాష్ట్రంలోనే తొలిసారి కాఫీ పార్కు కు సీఎం చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. పంట నుంచి కాఫీ తాగే కప్పు (బీన్ టు కప్) వరకు అన్నీ ఒకే ప్రదేశంలో ఉత్పత్తిచేసే స్థాయిలో పార్కు అందుబాటులోకి రానుంది.
- గత ప్రభుత్వ హయాంలో రైతులకు ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాల స్థానంలో రాజముద్రతో కొత్తవి పంపిణీ చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
- అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో ట్రాన్స్ జెండర్లందరికీ ఉచితంగా డిగ్రీ కోర్సులను అందించనున్నారు.
- హిందీ సాహిత్యం, భాషల పురోగతికి విశిష్టమైన సేవలు అందించినందుకు కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావుకు బిహార్ ప్రభుత్వ ప్రతిష్టాత్మకమైన గంగాశరణ్ సింగ్ పురస్కారం లభించింది.







## జాతీయం

**ఆగస్టు 4 - ఆగస్టు 10**

- 334 నమోదిత, గుర్తింపు పొందని పార్టీలను డీలిస్ట్ చేసినట్లు ఎన్నికల కమిషన్ (ఈసీ) ప్రకటించింది.
- దేశంలో ప్రస్తుతం అమలవుతున్న ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) పథకం కింద లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీగా అందజేయడానికి 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.12 వేల కోట్లు కేంద్ర మంత్రివర్గం కేటాయించింది.
- అమెరికాతో కీలకమైన ఆయుధ కొనుగోలు ఒప్పందాలకు భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఆదాయపు పన్ను బిల్లు 2025ను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించింది.
- దేశ చరిత్రలో అత్యధిక కాలం కేంద్ర హోంశాఖ మంత్రిగా పని చేసిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. ఇప్పటి వరకూ బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీ పేరుతోఉన్న రికార్డును షా బద్దలు కొట్టారు. షా హోంశాఖ బాధ్యతలు స్వీకరించి ఆరు సంవత్సరాల 64 రోజులు పూర్తైంది. దాదాపు 2,194 రోజులు అమిత్ షా హోం మంత్రిగా పనిచేశారు.
- నంబియో సేఫ్టీ ఇండెక్స్ (Numbeo Safety Index) ప్రపంచవ్యాప్తం గా ఉన్న సురక్షిత నగరాలు, దేశాలు-2025 జాబితాను విడుదల చేసింది. ప్రపంచంలోని అత్యంత సురక్షితమైన దేశాల జాబితాలో భారత్ 67వ స్థానంలో నిలిచింది. దేశంలో టాప్-10 నగరాలు వరుసగా మంగళూరు, వడోదర, అహ్మదాబాద్, సూరత్, జైపూర్, నవీ ముంబై, తిరువనంతపురం, చెన్నై, పుణె, చండీగఢ్ ఉన్నాయి.



- ఇండో, పాక్ ఉద్రిక్తతలను తగ్గించింది ట్రంప్ అని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియా తెలిపారు.
- దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల ప్రయోజనాలను కాపాడటంలో రాజీ పడబోమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.
- సెప్టెంబర్ 9న నిర్వహించనున్న ఉపరాష్ట్రపతి ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది.
- జమ్ముకశ్మీర్ మాజీ గవర్నర్ బీజేపీ సీనియర్ నాయకుడు సత్యపాల్ మాలిక్ కన్నుమూశారు.
- జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) వ్యవస్థాపకుడు, సీనియర్ గిరిజన నేత, శిబూ సొరేన్ కన్నుమూశారు.
- ప్రపంచ క్రీడల్లో భారత ఆర్చర్ రిషభ్ యాదవ్ వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు.
- భారత ఆర్థిక వ్యవస్థను 'డెడ్ ఎకానమీ' అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన విమర్శలకు ప్రధాని మోదీ పరోక్షంగా స్పందించారు. ప్రపంచంలో టాప్-3 ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోందన్నారు. సంస్కరణ, పనితీరు, పరివర్తన అనే స్ఫూర్తి నుంచి ఈ వేగం వచ్చిందన్నారు.
- భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ (ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1) చైనా పర్యటన ఖరారైంది.
- తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఓపెన్-బుక్ ఎగ్జామ్స్‌ను 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాలని సీబీఎస్ఈ నిర్ణయించింది.
- పరిమాణంలో సూర్యుడి కన్నా 3,600 కోట్ల రెట్ల పెద్దదైన కృష్ణ బిలాన్ని ఖగోళ శాస్త్రవేత్తలు గుర్తించారు.
- భారత సైన్యం, వాయుసేనలో సేవలందిస్తున్న చేతక్, చీతా హెలికాప్టర్లు త్వరలో సేవలనుంచి తప్పుకోనున్నాయి.

# విద్య, ఉద్యోగ సమాచారం





**గేట్ - 2026 పరీక్ష షెడ్యూల్**

దేశంలోని ఐఐటీలు సహా పలు ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్ 2026) రాత పరీక్షకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. తాజా షెడ్యూల్ ప్రకారం గేట్ పరీక్షకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఈ ఏడాది ఆగస్టు 25, 2025 నుంచి సెప్టెంబర్ 25, 2025వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించన్నట్లు ఐఐటీ గువాహటి తెలిపింది.

ఇప్పటికే గేట్ 2026 వెబ్‌సైట్‌లో ప్రవేశ పరీక్ష వివరాలను అందుబాటులో ఉంచారు. ఆలస్య రుసుంతో అక్టోబర్ 6, 2025వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజు కింద ఒక్కో టెస్ట్ పేపర్‌కు మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.1000, ఇతర కేటగిరీలు, విదేశీ విద్యార్థులు రూ.2000 చొప్పున చెల్లించవల్సి ఉంటుంది.

ఇక గేట్ 2026 ఆన్‌లైన్ పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 7, 8, 14, 15 తేదీల్లో దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించనున్నారు. ఈ పరీక్ష మూడు గంటల పాటు జరగనుంది. గేట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు మార్చి 19, 2026న విడుదల చేస్తారు. ప్రస్తుత ఏడాదిలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ఈ పరీక్ష రాసేందుకు అర్హులు. ఒక అభ్యర్థి ఒక దరఖాస్తు మాత్రమే చేసుకునే అవకాశం ఉంటుంది.

ఒకవేళ ఎవరైనా రెండు పేపర్లు రాయాలనుకుంటే.. ఒకే ఫారమ్‌లో ఆ వివరాలు నింపాల్సి ఉంటుంది. ఒకటికంటే ఎక్కువ దరఖాస్తులు సమర్పిస్తే మాత్రం వాటిని తిరస్కరించే అవకాశం ఉంది. అలాగే ఆయా



పేపర్లకు చెల్లించిన ఫీజును కూడా రిఫండ్ చేయరు. కాగా గేట్ స్కోర్ ఆధారంగా ఐఐటీల్లో నేరుగా పీహెచ్‌డీలో కూడా ప్రవేశాలు కల్పించడంతోపాటు పలు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు కూడా కల్పిస్తారు. ఇతర వివరాలు అధికారిక వెబ్‌సైట్ https://gate2026.iitg.ac.in/లో తెలుసుకోవచ్చు.

**కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ సెప్టెంబర్‌లో...**

దేశంలోని వివిధ ప్రభుత్వ విభాగాలు, మంత్రిత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (SSC) కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ 2025 సెప్టెంబర్‌లో నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి గతంలో ఇచ్చిన ప్రకటన మేరకు ఆగస్టు 13వ తేదీన దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో నిర్వహించాలి. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల కంబైండ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ (సీజీఎల్) 2025 పరీక్ష తేదీల్లో మార్పు చేస్తున్నట్లు తిరిగి సెప్టెంబర్ మొదటి వారంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్ఎస్సీ వెల్లడించింది. పరీక్షలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను త్వరలో వెల్లడిస్తారు.

**దోస్త్ సీట్ల నిర్ధారణ గడువు పెంపు..**

దోస్త్ ప్రత్యేక విడత ద్వారా డిగ్రీ సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేసే గడువు, ఆయా కాలేజీల్లో ధ్రువపత్రాలు ఇచ్చి రిపోర్టింగ్ చేసే గడువును పొడిగించింది. ఆగస్టు 12వ తేదీ వరకు ఇందుకు అవకాశం ఇస్తున్నట్లు దోస్త్ కన్వీనర్ వి బాలకిష్టారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తొలుత ఇచ్చిన ప్రకటన మేరకు ఆగస్టు 6వ తేదీతో తుది గడువు ముగిసింది. రాష్ట్రంలో కురుస్తున్న వరుస వర్షాలు, సెలవుల కారణంగా గడువు తేదీని పొడిగించమని వినతులు అందాయని, ఆ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అన్ని ప్రైవేట్ కాలేజీల్లో స్పాట్ ప్రవేశాలను సైతం ఆగస్టు 14వ తేదీలోపు చేసుకోవచ్చని తెలిపారు.

**CLAT 2026**

దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల్లో అందించే అండర్ గ్రాడ్యుయేట్(యూజీ), పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) లా ప్రొగ్రామ్‌లో ప్రవేశాల కోసం 'క్లాట్' నోటిఫికేషన్ వెలువడింది. జాతీయ స్థాయి ఎంట్రెన్స్ఆధారంగా 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్'(క్లాట్)-2026 అడ్మిషన్స్ జరుపుతారు. ర్యాంకు సాధించిన విద్యార్థులకు ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎమ్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ లభిస్తుంది.

కోర్సులు:అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ లా డిగ్రీ)

పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్(ఏడాది ఎల్ఎల్ఎం డిగ్రీ)

అర్హతలు: అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చేయాలనుకునే విద్యార్థులు కనీసం 50 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ పాసై ఉండాలి.

- చివరి తేదీ: 2025 అక్టోబర్ 31
- ఎంట్రెన్స్ తేదీ: 2025 డిసెంబర్ 7
- వెబ్‌సైట్: consortiumofnlus.ac.in/